క్లుప్తంగా

పెద్దమ్మ దేవర ఏర్పాట్లపై డీఎస్పీ ఆరా



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రమోద్

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నెలో వెలసిన మూల పెద్దమ్మ దేవరకు సంబంధించి డీఎస్పీ ప్రమోద్ గురువారం ఆరా తీశారు. ముందుగా ఆయన అమ్మవారిని దర్శించుకొని ట్రాఫిక్, పార్కింగ్ వంటి వాటి గురించి కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకునేలా వసతులు, భద్రతాపరమైన చర్యలు తీసుకోవాలని సీఐ మురళీధర్‌రెడ్డిని ఆదేశించారు. భక్తులు ఎంతమంది రావచ్చనేది ఆలయ కమిటీతో చర్చించారు.

రేషన్ డీలర్ల కమీషన్ పెంచాలి



తహసీల్దార్ ప్రియదర్శిణికి వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రేషన్ డీలర్ల కమీషన్ తక్షణమే పెంచాలని డీలర్ల సంఘం నాయకుడు హరి కోరారు. ఎండీయూ వాహనాల తొలగింపుతో డీలర్ల ఎదుగుదలకు కూటమి ప్రభుత్వం పరోక్ష సహకారం అందించిందన్నారు. కమీషన్ పెంపుపై ప్రభుత్వానికి విన్నవించాలని కోరుతూ గురువారం తహసీల్దార్ ప్రియదర్శిణికి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లగా రేషన్ డీలర్లుగా ఉంటూ ప్రజాసేవ చేస్తున్నామని, ప్రభుత్వం మరింత సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు గిరి, సలాం పాల్గొన్నారు.

దేవాలయ భూములకు తగ్గిన ఆదాయం



వేలం పాటలు నిర్వహిస్తున్న దృశ్యం

గోస్పాడు: మండలంలోని జిల్లెల్ల గ్రామంలోని రామనందీశ్వర స్వామి, చెన్నకేశవ స్వామి దేవాలయాల భూములకు గురువారం వేలాలను ఈవో వీరయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. రామనందీశ్వర స్వామి ఆలయానికి చెందిన 37.54 ఎకరాలకు గత ఏడాది రూ 6.66లక్షలు రాగా ఈ ఏడాది వేలంలో రూ.5.98 లక్షలు, చెన్నకేశవ స్వామి ఆలయానికి చెందిన 3 ఎకరాలకు గతేడాదిరూ 66వేలు రాగా, ఈ ఏడాది రూ.58 వేలు వచ్చిందని తెలిపారు. గతేడాదితో పోలిస్తే ఆదాయం తగ్గింది.

'సిద్ధేశ్వరం' త్వరగా పూర్తి చేయాలి

నంద్యాల(న్యూటౌన్): జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో ప్రజా సమస్యలు ఎక్కడ వేసిన గొంగలి అక్కడ మాదిరిగా ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా ఇంత వరకు జిల్లాలో అభివృద్ధి శూన్యమన్నారు. ఎంపీ బైరెడ్డి శబరి అలుగు నిర్మాణంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించి పూర్తి చేయాలని కోరారు. ఈనెల 31న సిద్ధేశ్వరం వద్ద జరిగే ఆందోళనకు సీపీఐ, ఏపీ రైతు సంఘం సంఘీభావాన్ని ప్రకటిస్తున్నట్లు తెలిపారు. టీడీపీ మహానాడులో అలుగు నిర్మాణంపై తీర్మానం చేసి అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్, జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్, నాగరాముడు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న, ఏఐటీయూసీ కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో స్వచ్ఛసేవ



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

శ్రీశైలంటెంపుల్: స్వచ్ఛ శ్రీశైలం నిర్వహణలో భాగంగా గురువారం క్షేత్ర పరిధిలో పారిశుద్ధ్య స్వచ్ఛసేవా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముందుగా గంగాధర మండపం నుంచి నందిగుడి వరకు అవగాహన ర్యాలీ ఏర్పాటు చేశారు. ఆలయ ప్రధాన వీధులు, గంగాధర మండపం నుంచి నంది మండపం వరకు, డొనేషన్ కౌంటర్, అన్నదాన విభాగం, గణేష సదన్, ఘంటామఠం, యాంపిథియేటర్, టూరిస్ట్ బస్టాండ్, పాత ఫిల్టర్ బెడ్ ప్రాంగణంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు.



ప్రత్యేక అలంకరణలో బైటిపేట ఆంజనేయస్వామి



టెక్కె నాగులకట్ట దేవాలయంలో అరటి పండ్ల అలంకరణ



ఎస్‌బీఐ కాలనీలో ఆకుపూజ అలంకారంలో స్వామి వారు



కాళికాంబ చంద్రశేఖర దేవాలయంలో అభయాంజనేయస్వామి



రుద్రవరంలో పూజలందుకున్న హనుమంతుడు



పూజలందుకుంటున్న స్వామి

పవనసుతా.. పాహిమాం!

- ఘనంగా హనుమాన్ జయంతి
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- పలు గ్రామాల్లో స్వామి ఉత్సవమూర్తికి గ్రామోత్సవం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని పలు దేవాలయాల్లో గురువారం హనుమాన్ జయంతిని పురస్కరించుకొని పంచామృతాభిషేకాలు, పూలంగిసేవ, ఆకుపూజ, సింధూరపూజ, వడమాల, అరటి పండ్లతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. సాయంత్రం పానకం, వడపప్పును పంపిణీ చేశారు.

- బైటిపేట ఆంజనేయస్వామి దేవస్థానంలో తెల్లవారుజామునే స్వామి వారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి సింధూర అభిషేకం, తమలపాకులచే అర్చన, వడమాల, పూలంగిసేవ, అరటి పండ్లచే అలంకరింపజేసి భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవమూర్తిని పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. చైర్మన్ వెంకటేశ్వర్లు, ఈఓ వేణునాథరెడ్డి పాల్గొన్నారు.
- సంజీవనగర్ రామాలయంలో శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో స్వామి వారికి ఉదయమే క్షీరాభిషేకం, నూతన ముత్యపుకవచం అలంకరించి హనుమాన్‌చాలీసా పారాయణం, మహా మంగళ హారతులు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం పల్లకిసేవ నిర్వహించారు.
- టెక్కెలోని నాగులకట్ట గౌరీ సహిత స్పటిక లింగేశ్వర అభయాంజనేయస్వామి, దేవనగర్‌లోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో కాళిమాత సేవా సమితి ఆధ్వర్యంలో స్వామి వారికి విశేష పూజలు చేపట్టారు. ఈఓ లక్ష్మినారాయణ, ఆరవేటి వాసు, విజయ్, రమేష్, తదితరులు పాల్గొన్నారు. ఎస్‌బీఐ కాలనీలోని త్యాగరాజస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య నంద్యాల జిల్లా ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శి నగరడోన సుధీర్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు.
- శిరివెళ్ల: మండలంలో గురువారం హన్‌మాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. వెంకటాపురంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో భక్తులతో హోమాలు, భజనలు జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రికి స్వామి ఉత్సవమూర్తిని ఊరేగించారు.
- చాగలమర్రి: మూడురాళ్లపల్లె గ్రామానికి వెళ్లే మార్గంలో నిలువు బండ వద్ద వెలసిన అంబాపురం అభయాంజనేయస్వామి విగ్రహం వద్ద గురువారం హనుమాన్ జయంతి వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారికి ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, పురషసూక్తం, అభయాంజనేయ అభిషేకం, పతాక ఆవిష్కరణ, తీర్థ ప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. వేలాదిగా తరలి వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం గొడిగనూరు గ్రామానికి చెందిన చందూ, రహీం ఆధ్వర్యంలో విద్యార్థుల కోలాటం ఆకట్టుకుంది.
- రుద్రవరం: మండల కేంద్రంతో పాటు చందలూరు,ముత్తలూరు,చిన్నకంబలూరు,శ్రీరంగాపురం ,నర్సాపురం తదితర గ్రామాల్లో గురువారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. హనుమంతుడికి అభిషేకాలు,అలంకారాలతో ప్రత్యేక పూజలు చేశారు.స్థానిక పడమటి వీధిలో వెలసిన ఆంజనేయ స్వామి ఆలయంలో ఉదయం నుంచి హనుమాన్ విగ్రహానికి అభిషేకం, విశిష్ట అలంకారం గావించారు. హోమాది పూజా కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం హనుమంతుడి ఉత్సవమూర్తికి గ్రామోత్సవం చేశారు.భక్తాదులకు అన్నదానం గావించారు.
- దొర్నిపాడు: మండలంలో అర్జునాపురం, కొండాపురం, క్రిష్టిపాడు, రామచంద్రాపురం, భాగ్యనగరం, దొర్నిపాడు గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. అర్జునాపురంలో ధార్మిక సంయోజకుడు శిలువయ్య, విశ్రాంతి ఉపాధ్యాయుడు బాల తిమ్మారెడ్డి హనుమాన్ జయంతి విశిష్టతను భక్తులకు వివరించారు.
- ఉయ్యాలవాడ : ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, నర్సిపల్లె, పుచ్చకాయలపల్లె గ్రామాల్లో వెలిసిన అభయాంజనేయస్వామి, సంజీవరాయుడు స్వామిలను ప్రత్యేకంగా అలంకరించారు. స్వామికి అభిషేకం, పంచామృతాభిషేకం, ఆకుపూజ, కుంకుమ, సింధూ అర్చనలు చేసి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు లక్ష్మణస్వామి, భాస్కరశర్మలు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



మూడురాళ్లపల్లెలో శ్రీఅభయాంజనేయస్వామి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు



అర్జునాపురంలో హనుమాన్ జయంతి విశిష్టతను వినిపిస్తున్న దృశ్యం



హోమ పూజల్లో పాల్గొన్న భక్తులు





మూడురాళ్లపల్లెలో అన్నదానం, నంద్యాలలో బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



అభయాంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు



శిరివెళ్లలో అన్నదానం

కనుల పండువగా వీరహనుమాన్ శోభాయాత్ర



మాట్లాడుతున్న ఎంపీ బైరెడ్డి శబరి



శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకొని విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ ఆధ్వర్యంలో వీరహనుమాన్ శోభాయాత్ర అత్యంత భక్తిశ్రద్ధలతో జై వీరహనుమాన్ నినాదాలతో కొనసాగింది. ముందుగా కార్యక్రమాన్ని ఎంపీ బైరెడ్డి శబరి జెండా ఊపి ప్రారంభించారు. టెక్కె మార్కెట్‌యార్డు, రాజ్‌థియేటర్, శ్రీనివాససెంటర్, ఎన్‌జీరోడ్డు, బైర్మల్ వీధి గుండా యాత్ర సాగింది. కార్యక్రమంలో కళాకారుల కోలాటాలు, చెక్కభజనలు, సీతారామ లక్ష్మణుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. చివరకు బైటిపేటలోని ఆంజనేయస్వామి గుడి వద్దకు చేరుకుంది. వీహెచ్‌పీ నాయకులు సత్యరవి, విష్ణువర్ధన్‌రెడ్డి, బుగ్గన చంద్రమౌళీశ్వరరెడ్డి, వెంకటసుబ్బయ్య, శివయోగేంద్ర సరస్వతి, పోలేపల్లి సందీప్, న్యాయవాదులు రామచంద్రారావు, తులసీరెడ్డి, మేడా మురళీ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పట్టణంలో శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం





సీతారామ లక్ష్మణ వేషధారణలో చిన్నారులు

కౌలు కార్డులపై అవగాహన



నేలంపాడులో కౌలు రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ రంగనేతాజీ

చాగలమర్రి: మండలంలోని పెద్దబోధనం, నేలంపాడు గ్రామాల్లోని కౌలు రైతులకు పంటసాగు హక్కు పత్రాలపై గురువారం మండల వ్యవసాయాధికారి రంగనేతాజీ అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కౌలు రైతులకు కూడా భూ యజమానులకు పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేసినట్లే.. పంటసాగు హక్కు పత్రాల ద్వారా పథకాలు అందజేస్తుందన్నారు. కౌలు కార్డులు పొందేందుకు వీఆర్‌ఓకు భూ యజమాని ఆధార్, పొలం పాసు పుస్తకం, కౌలు రైతు ఆధార్ జిరాక్స్ కాపీలు జత పరచి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కౌలు కార్డుల కాల పరిమితి 11నెలలు మాత్రమేనని భూ యజమానులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

జయప్రదం చేయండి

నంద్యాల(న్యూటౌన్): విజయవాడలో జూన్ 5న జరిగే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల మూడవ కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఏపీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్రప్ప పిలుపునిచ్చారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఇందుకు సంబంధించిన పోస్టర్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు, రాయితీలు పీఆర్సీ గురించి చర్చిస్తామన్నారు. నంద్యాల జిల్లా నుంచి అన్ని శాఖల ఉద్యోగులు తరలిరావాలని కోరారు. జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ చంద్రశేఖర్, సిటీ కార్యదర్శి శ్రీనివాసులు, విజయకుమార్ పాల్గొన్నారు.

బొప్పాయి రైతు కుదేలు

- పతనమైన ధర, దిగుబడి
- టన్ను రూ.25వేల నుంచి రూ.7వేలకు
- ఎకరాకు 6–8 టన్నులకు గానూ.. 2–3 టన్నులకు పరిమితమైన దిగుబడి
- గిట్టుబాటు కావడం లేదంటున్న రైతులు
- నష్టాలే మిగిలుతున్నాయంటూ ఆవేదన



రుద్రవరం: రైతన్నకు వ్యవసాయం కలిసి రావడం లేదు. ఏ పంట సాగు చేసిన ఏదో ఒక కారణంతో నష్టపోతూనే ఉన్నాడు. ఆదుకోవాల్సిన ప్రభుత్వంలో స్పందన కరువైంది. దీంతో రైతన్న దిక్కుతోచని స్థితిలో పడిపోయాడు. ప్రస్తుతం ఈ పరిస్థితి రుద్రవరం మండలంలో బొప్పాయి పండ్ల తోటలు సాగు చేసిన రైతుల్లో నెలకొంది.

పడిపోయిన దిగుబడి..

మండల కేంద్రంతో పాటు రెడ్డిపల్లె, ఆర్.నాగులవరం, తిప్పారెడ్డిపల్లె, ఆలమూరు, అప్పనపల్లె, పెద్ద కంబలూరు, డి.కొట్టాల తదితర గ్రామాల్లో దాదాపు 200 ఎకరాల్లో బొప్పాయి తోటలు సాగు చేశారు. ఒక్కో మొక్క రూ.13 ప్రకారం కొనుగోలు చేసి ఎకరాకు 900 మొక్కలు నాటారు. ఇటీవల కురిసిన వర్షాలకు బొప్పాయి చెట్లు విరిగి నేలకూలాయి. అయితే ఉద్యాన వన శాఖ అధికారులు పరిశీలించి కేవలం 30 ఎకరాల్లో మాత్రమే నష్టం వాటిల్లిందని నివేదికలు రూపొందించారు. అయినా నేటికీ నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందలేదు. ఉన్న అరకొర చెట్ల నుంచి వచ్చిన దిగుబడిని విక్రయించుకుంటున్నారు. రెండు నెలల క్రితం టన్ను రూ.25వేలు ఉండగా ప్రస్తుతం రూ.7వేలకు పడి పోయింది. ఒక్కో ఎకరానికి 6 నుంచి 8 టన్నుల వరకు దిగుబడి రావాల్సి ఉండగా 2–3 టన్నులే వస్తున్నాయి.కాయలు కోయించడం, వాటికి పేపర్లు చుట్టించడం, ట్రాక్టర్లకు ఎక్కించి ఆర్అండ్‌బీ రోడ్లపై ఉన్న లారీల వద్దకు తరలించడం వంటి ఖర్చులే తడిసి మోపెడవుతున్నాయని తమకు ఏమీ మిగలడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. పేరుకేమో గల్లీ నుంచి ఢిల్లీ దాకా.. అన్నట్లు ఇక్కడ పండించే బొప్పాయి పండ్లను పంజాబ్, ఢిల్లీ, ముంబయి వంటి ప్రాంతాలకు తరలిస్తున్నారు. దిగుబడులు తగ్గి, ధరలు పడిపోయి,ఖర్చులు పెరిగి నష్టాలు మాత్రమే మిగులుతున్నాయని లబోదిబోమంటున్నారు.



ఆలమూరులో కోత కోసి కాయలకు పేపర్లు చుట్టిన దృశ్యం



ఆర్.నాగులవరం వద్ద ట్రాక్టర్‌లోని కాయలను లారీలోకి లోడ్ చేస్తున్న దృశ్యం

ఆశలు ఆవిరి



బొప్పాయి తోటల సాగు అంటే మంచి లాభాలు వస్తాయని ఎన్నో ఆశలు ఉండేవి. మంచి దిగుబడులు వస్తాయి, ధర కూడా బాగా ఉంటాయని మూడెకరాల్లో బొప్పాయి సాగు చేశాం.అయితే ఈ ఏడాది ఇటీవల గాలీ వానకు కొంత దెబ్బతీస్తే, ధరలు పడిపోయి మా ఆశలను ఆవిరి చేశాయి. నిన్న, మొన్నటి వరకు టన్ను బొప్పాయి కేవలం రూ.5వేలే ఉండేదని, ప్రస్తుతం కాస్త పెరిగింది. ప్రభుత్వం కూడా వ్యవసాయ రంగాన్ని పట్టించుకోకపోవడంతో మా ఆశలు నీరుగారాయి.

– సుశీల,మహిళా రైతు, ఆర్.నాగులవరం

భూసార పరీక్ష.. పుడమికి రక్ష

- పరీక్షలతో నేల స్వభావంపై ఖచ్చితమైన అంచనా
- ఫలితాల ఆధారంగా ఎరువుల వినియోగం, పంటల సాగు



బోడెమ్మనూరు వద్ద పొలంలో మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

ఉయ్యాలవాడ : వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గి దిగుబడులు పెరగాలంటే భూసార పరీక్షలు తప్పనిసరని వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. సాగు భూమిలో భూసార పరీక్షలు చేయడం వల్ల నేలలోని పోషకాలు, పోషకాల లోపం, ఆమ్ల, క్షార స్థితి, చౌడు, ఇతర సమస్యలు తెలుస్తాయి. అలాగే ఏ ఎరువులు వేయాలో ఫలితాల్లో వెల్లడవుతుండటంతో అనవసరమైన వాటిని వినియోగించాల్సిన అవసరం ఉండదు. దీంతో పెట్టుబడి గణనీయంగా తగ్గుతుంది. వ్యవసాయం లాభసాటిగా ఉండాలంటే తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు పొందే మార్గం అనుసరించాలి. భూమిలో వున్న పోషకాలు, లోపాలు తెలుసుకుని వాటికి అనుగుణంగా పంటల సాగు, ఎరువుల వినియోగించడానికి భూసార పరీక్షలు ఎంతగానో దోహదపడతాయి. అధిక దిగుబడులు సాధించే లక్ష్యంతో కొంత మంది అన్నదాతలు రసాయనిక ఎరువులు, పురుగు మందులు అవసరానికి మించి వినియోగించడంతో భూమిలో పోషకాలు నశిస్తున్నాయి. దీంతో నత్రజని తగ్గి భూమి ఉత్పాదక శక్తిని కోల్పోతుంది. నేల చౌడు బారడంతో పాటు చీడపీడల ఉధృతి, వాతావరణం కాలుష్యం వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. భూసార పరీక్షలతో నేల భౌతిక రసాయనిక లక్షణాలు తెలుసుకునేందుకు అవకాశం కలుగుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

1,100 మట్టి నమూనాలు సేకరిస్తున్నాం



మండలంలో ప్రస్తుతం 1,100 మంది రైతుల పొలాల నుంచి మట్టి నమూనాలు సేకరిస్తున్నాం. మట్టి నమూనాలను పరీక్షల నిమిత్తం జిల్లా కేంద్రం నంద్యాలలోని ల్యాబ్‌కు పంపుతాం. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఏ పంటకు ఎంత మోతాదు పోషకాలు అవసరమో తెలుస్తుంది. భూమిలో లోపించిన పోషకాలను గుర్తించి దానికి అనుగుణంగా ఎరువులను వినియోగించడంతో పెట్టుబడి ఖర్చు తగ్గించుకునేందుకు వీలు కలుగుతుంది. పరీక్షల ద్వారా నాణ్యమైన, అధిక దిగుబడులు రైతులు సాధించవచ్చు.

– చంద్రశేఖర్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి

ప్రమాద సూచికల ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్

రుద్రవరం: రుద్రవరం–నర్సాపురం ఆర్అండ్‌బీ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా గుంతలు తవ్వారు. పది రోజులు దాటినా గుంతల్లో పిడికెడు మట్టి వేయకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సమస్యపై సాక్షిలో గురువారం 'అస్తవ్యస్తం..ప్రమాదకరం' అన్న కథనం ప్రచురితం కావడంతో ఆర్అండ్‌బీ అధికారుల్లో చలనం వచ్చింది. వెంటనే గుండ్రాళ్లు తోలించి వాటికి సున్నం పూయించి గుంత పక్కన వరుసగా పేర్చారు. ప్రమాద హెచ్చరికలను తెలియజేస్తూ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. సంబంధిత కాంట్రాక్టర్‌తో పనులు చేయించక పోవడంపై ప్రజలు, వాహనదారులు మండిపడుతున్నారు.



తవ్విన గుంత పొడవునా ఏర్పాటు చేసిన సున్నం రాళ్లు